



# 4

# సూపర్‌మామ్ సిండ్రోమ్

పి. సత్యవతి

'సుమతి సూర్యుణ్ణి ఆపేసినట్లు, అనూరాధ కాలక్రమాన్ని నిలిపివేసిందా, ఏం?' అనుకున్నాడు సూర్యారావు, ఉలిక్కిపడి ప్రక్క మీద నుంచి లేచి కూర్చుంటూ.

'కాలచక్రం ఏం ఆగిపోలేదు. అనూరాధే ఆగిపోయింది,' అన్నట్టు గోడ గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. అనూరాధ లేచి సగంపనులు పూర్తిచేస్తేగానీ సూర్యుడు ఉదయించడు. వంట ఇల్లు మేల్కోదు. వాకిట్లో ముగ్గు పడదు. వంట ఇల్లు ఈలలతో గోలలతో చైతన్యవంతం కాదు. ఒకటేమిటి- లోకమే సుషుప్తిలో నుంచి చైతన్యంలోకి రాదు. అటువంటి అనూరాధ ఇంకా దుప్పటి ముసుగుతన్ని పడుకోడం ఏమిటో సూర్యారావుకి అర్థంకాలేదు. ఆమె బాధ్యత లేని గృహిణి ఏమాత్రం కాదు.

రోజూ అయిదింటికి ఠంచనుగా నిద్రలేచి సందు చివరదాకా నడిచివెళ్లి పాలప్యాకెట్లు తెస్తుంది. పాలు తెచ్చే మనిషి ఈమధ్య ప్యాకెట్టుకి పది రూపాయలు చేసిందగ్గర్నుంచీ అనూరాధ మార్నింగ్ వాక్ మొదలు పెట్టింది. నెలకి ముప్పై రూపాయలు ఆదా చేస్తుంది. తెల్లవారేసరికల్లా వచ్చి వాకిలి వూడ్చి ముగ్గువేసే మనిషిని పెట్టుకుంది. అప్పుడే గిన్నెలు కడిగిపెట్టి వెడుతుంది ఆవిడ. ఎందుకంటే అనూరాధకి ఎనిమిదిన్నరకల్లా పనైపోవాలి. ఆవిడనిప్పుడు డౌన్‌టౌన్ బ్రాంచికి మార్చారు. టౌన్ చాలా రద్దీగా వుంటుంది. రిక్షా ఎక్కితే చాలా ఖర్చైతుంది. ఆటో అంటే మాటలుకాదు. అందుకని మోపెడ్ కొనుక్కుంది ఇటీవలే. ఆ మోపెడ్ కొనుక్కున్నప్పుడు ఆమె వయస్సు నలభై అయిదు సంవత్సరాలు. రద్దీగా వుండి ఒక క్రమం లేని ట్రాఫిక్‌లో డ్రైవ్ చెయ్యడం కష్టం గనుక ముప్పావుగంట ముందే బయలుదేరుతుంది. మరలాంటిది తొమ్మిది గంటల దాకా నిండా ముసుగు పెట్టుకుని పడుకుందంటే- వంట్లో బాగా లేకపోయి వుండాలి. అనూరాధకి వంట్లో బాగా లేకపోవడం సూర్యారావు ఎప్పుడూ చూడలేదు ఈమధ్య.

సూర్యారావు ఆమె మొహం మీద కప్పుకున్న దుప్పటిలాగి పడేశాడు. కళ్లు పెద్దవి చేసి, నోటి మీద చెయ్యి వేసుకుని, తూలిపడబోయి, గోడ కానుకుని నిలబడ్డాడు. అనూరాధ శరీరమంతా తెల్లగా సున్నం కొట్టినట్లు మారిపోయింది. కళ్లు తెరుచుకుని వున్నాయి. కట్టిన చీరె కట్టినట్లే వుంది. కానీ చేతులూ కాళ్లూ సీమ సున్నంతో చేసినట్లయిపోయాయి. కళ్లూ జుత్తూ తప్ప శరీరం అంతా అలాగే వుంది. కళ్లు ప్రశాంత నిర్మలంగా ఎన్నడూ లేనంతగా మెరుస్తున్నాయి.

రాత్రి పన్నెండుదాకా ఆమె మామూలుగానే వుంది. ఏడాది నుంచీ క్రమం తప్పకుండా ప్రతీరోజూ చూసే హిందీ సీరియల్ చూసింది. ఈపూట కోసం ఇడ్లీ పప్పు గ్రైండ్ చేసి పెట్టింది. మంచినీళ్లు కాచి ఫిల్టర్‌లో పోసింది. ఒకటేమిటి లక్షన్నర పన్లు చేసింది. ఆమెకు చాలా ముందుచూపు. ఇవ్వాళ్టి కోసం నిన్ననే చాలా ఏర్పాట్లుచేసింది. ఇప్పుడేమో ఇలా తెల్లగా సున్నపు బొమ్మలా మారిపోయింది. ఇలాంటి జబ్బు చెయ్యగా ఇంతవరకూ ఎవర్నీ చూడలేదు సూర్యారావు. ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూశాడు. శ్వాస నిలిచిపోయింది. గుండెమీద తలఆన్చి చూశాడు. స్పందన లేదు. ఉలిక్కిపడ్డాడు. అనూరాధ చచ్చిపోయిందా! అనూరాధ చచ్చిపోవడం ఏమిటి? సూర్యారావు చెమటతో తడిసిపోయాడు. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లి

స్నేహితుడు సుబ్బారావుకి ఫోన్ చేసి డాక్టర్ని వెంట బెట్టుకు రమ్మన్నాడు. అనూరాధకి వచ్చిన జబ్బేమిటో డాక్టర్‌కీ అర్థంకాలేదు కానీ- ఆమె చనిపోయిందని మాత్రం ధృవపరిచాడు. క్షణాల మీద అనూరాధ మరణ వార్త వీధంతా పాకింది. ఇరుగుపొరుగు గబగబా కాఫీలు కాచేసుకుని తాగేసి మంచినీళ్లు గట్రా పట్టేసుకుని సూర్యారావు ఇంటికి వచ్చారు.

శవాన్ని క్రిందకి దించి తల దగ్గర దీపం పెట్టా లంది ప్రక్కింటి మామ్మగారు.

వరండాలో చాపవేసి దాని మీదకి చేర్చారు. "పిల్ల లకి ఫోన్ చెయ్యి సూర్యారావు," అన్నాడు సుబ్బారావు. సుబ్బారావు తడవకీ ఎస్టీడీలు చేసేస్తున్నాడని ఆ సౌకర్యాన్ని తీసేయించింది అనూరాధ. పిల్లల ఫోన్ నెంబర్లూ, డబ్బూ ఇచ్చి సుబ్బారావుని ఆ పనికి పురమా యించాడు సూర్యారావు. అతనింకా పళ్లు తోము కోలేదు. నిద్రలేస్తూనే అతను పళ్లు తోముకుని వచ్చే వేళకి పెద్ద మగ్గు నిండా ఆవిర్లు కక్కే కాఫీ సిద్ధంగా పెడుతుంది అనూరాధ. రెండు మగ్గుల కాఫీకి ఎంత పొడి వెయ్యాలో, ఎన్ని పాలు పొయ్యాలో ఎంత వెచ్చ చెయ్యాలో ఆమెకి తెలిసినట్లు ఎవరికీ తెలీదు. సుబ్బా రావుకి అనూరాధ శరీరాన్ని ఒకసారి ముట్టుకుని చూడాలని వుంది. మంచం మీద నుంచి దించేటప్పుడు కాళ్లు పట్టుకున్నాడుగానీ కాళ్ల మీద చీర కుచ్చెళ్లున్నాయి. ఆమె శరీరం సున్నంగా ఎలా మారిపోయిందో అది నిజంగా సున్నమా లేక ఇంకేమైనానా తెలుసుకోవాలని చాలా కుతూహలంగా వుంది. కానీ ఆ శరీరం అతని స్నేహితుని భార్యది- అతని వస్తువు కదా? శవమైనా అతనిదే కదా దాని మీద అధికారం. ముట్టుకుంటే ఊరుకుంటాడా లేదా?

ఎవరో చనువుగా ఇంట్లోకి చొరబడి కాఫీ చేసి తెచ్చి సూర్యారావుని బ్రతిమిలాడి యిచ్చారు. మరీ శవం ప్రక్కన కూర్చుని త్రాగడం యిష్టం లేక అవతల గదిలోకి వెళ్లాడతను. ఇదే అదననుకుని ఆమె కాలి దగ్గర కొంచెం గిల్లి, తెల్లని చిన్న ముక్క ఒకటి జేబులో వేసుకుని ఫోన్ చెయ్యడానికి వెళ్లాడు సుబ్బారావు.

"మామాని నేనొచ్చేదాకా వుంచండి. ఏదో ఒక ఫ్లయిట్‌కి ఎలాగోలా వచ్చి వాల్తాను. ఓకే," అంది సూర్యారావు కూతురు న్యూజెర్సీ నుంచి.

కొడుకు ఫోన్లోనే ఏడ్చేశాడు. అతగాడికి ఇండియా వస్తే మళ్లీ వీసా రెన్యూ అవడం కష్టం. "మామా ఎందు కిలా వెళ్లిపోయిందంకుల్- వాట్ హాపెన్డ్," అని ఆక్రో శించాడు.

వాణ్ణెలాగైనా స్టేట్స్ పంపాలని కంకణం కట్టు కుంది అనూరాధే. నయానా భయానా చదివించి, బోలెడు డబ్బు ఖర్చుపెట్టి వాణ్ణి స్టేట్స్ తరిమింది కూడా అనూరాధే. బ్యాంక్‌లో అందరూ ఆవిడ వంక చాలా అభినందన పూర్వకంగా చూస్తారు. 'నీ పిల్లలు రత్నాలు,' అంటారు. అలా అంతా అనాలని ఆవిడ ఆశించింది. ఆవిడ కోరిక ఫలించింది. బట్ ఫర్ మామా హి కుడ్‌న్ట్ హావ్ మేడిట్. కానీ ఇప్పుడు తను మామాని చూడలేడు. హి కాన్ట్ మేకిట్...

"బాడీని ఐస్ మీద వుంచాలేమో- అమ్మాయి వచ్చేదాకా ఇలా వుంచితే చెడిపోతుంది," అన్నారు ఎవరో.

"ఇది మామూలు శవంకాదు. ఇదంతా సున్నం లా వుంది. ఐస్ మీద పెడితే కరిగిపోదా?" అన్నాడు ఇంకొకరు.

"పోనీ శవం చుట్టూ ఏదైనా మందు చల్లండి," అని ఇంకొకరు సలహా యిచ్చారు.

ఫోన్లు చెయ్యడం పూర్తి చేసుకున్న సుబ్బారావు పనిలో పనిగా తనింటికి వెళ్లి టిఫిన్ తినేసి, తన జేబులో టాబ్లెట్ లాంటి వస్తువు తీసి అతని కూతురు చేతిలో పెట్టి- అనూరాధ మరణోదంతం ఏకరువుపెట్టాడు. ఆ పిల్ల చటుక్కున దాన్ని పర్సులో వేసుకుని దగ్గరలో వున్న లేబొరేటరీకి పరిగెత్తింది. వాళ్లు ఆ సున్నం ముక్కని తల నెప్పికి వేసుకునే ఆస్ప్రిన్ టాబ్లెట్ అని చెప్పారు.

"నేనూ అక్కడికొస్తాను నాన్నా," అని లెన్స్ ఒకటి పుచ్చుకుని సూర్యారావు ఇంటికి వచ్చింది సుబ్బారావు కూతురు. ఆ అమ్మాయి పేరు సుశీల. ఆ వీధిలో అనూరాధని తెలీని వాళ్లెవరూ లేరు. ఆమె రాకపోకల్ని బట్టి గడియారాలు సరిచేసుకునేవాళ్లు, ఆమెని చూసి ఇళ్లు తీర్చిదిద్దుకునేవాళ్లు, ఆమెని అనేక విషయాల్లో అనుకరించేవాళ్లు- అలా ఎందరో. సుశీల జనాన్ని తప్పించుకుని వచ్చి అనూరాధ చేతి మీద లెన్స్ పెట్టి చూసింది. ఆమె శరీరం సున్నంలా కాదు మారిపో యింది. ఆమె శరీరం రకరకాల టాబ్లెట్లు అతుకు పెట్టినట్లు వుంది. కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి, కొన్ని లేత గులాబి రంగువి, కొన్ని గుండ్రనివి, కొన్ని పలకలవి. ఇలా రకరకాల టాబ్లెట్లు అతికించి చేసిన బొమ్మలా వుంది అనూరాధ.

"ఆంటీ వొళ్లంతా టాబ్లెట్సండీ, చూడండీ ఇదుగో," అని ఆమె చేతి దగ్గర రెండు టాబ్లెట్లు గిల్లి తీసింది సుశీల.

''చీమలు వస్తున్నాయండీ,'' అందొకావిడ కంగారుగా.

"అవును, ఇందులో కొన్ని షుగర్ కోటెడ్ టాబ్లెట్స్ వుండి వుండవచ్చు గదా,'' అంది సుశీల.

అవును, షుగర్ కోటెడ్ టాబ్లెట్స్ తనూ ఇచ్చాడు కొన్ని ఆమెకి అనుకున్నాడు సూర్యారావు. సుశీల చేతిలో నుంచి లెన్స్ లాక్కుని చూస్తున్నారు. సూర్యారావు చూడకుండా ఆమె చేతుల్నీ కాళ్లనీ గిల్లి చూస్తున్నారు ఇంకా కొందరు.

చాప మీద నుంచి ఆమె శరీరాన్ని ఒక బల్లమీదకి చేర్చారు. చుట్టూ చీమల మందు చల్లారు. కూతురు వచ్చే వేళకి ఆమె శరీరాన్ని ఒక్కొక్కరే గిల్లి మాయం చేసేస్తారేమోననిపించింది సూర్యారావుకి. ''శవాన్ని పడకగదిలోకి తరలించండి,'' అన్నాడు ఉన్నట్టుండి.

''తప్పు నాయనా, అలా పెట్టకూడదు. ఏం నక్షత్రమో ఏమో,'' అంది పక్కింటి మామ్మగారు.

''ఫరవాలేదు మామ్మగారూ. ఈ ఇల్లు ఆవిడ లోన్ చేసి కట్టింది. ఈ ఇంటి కోసం ప్రతి రక్తం బొట్టూ వెచ్చించింది. అందుకోసం ఆమె శరీరం ఎక్కడన్నా పెట్టవచ్చు,'' అని అనూరాధ శరీరాన్ని దాచి పెట్టేశాడు సూర్యారావు.

ఇరవై ఎనిమిదేళ్ల సాహచర్యం. అన్నీ యిచ్చింది. స్నేహం, ప్రేమ, ధనం, సేవ- ఆఖరికి ఇప్పుడు ప్రాణం.

ఇల్లంతా జనంతో నిండిపోయింది. ఇంట్లో ఇంత మంది జనం వుండడం అనూరాధకిష్టం వుండదు. తను వేయించుకున్న మార్బుల్ రాళ్లు మాసిపోతే సబ్బు పెట్టి కడుక్కుని తుడుచుకునేది. బాత్‌రూంలు కడుక్కునేది. వచ్చినవాళ్లు తళతళలాడే అనూరాధ గ్యాస్‌పొయ్యి మీద పాలు మరగబెట్టి పొంగించేస్తున్నారు. సోఫాలన్నీ విరగ దొక్కుతున్నారు. అరూరాధ ప్రాణం ఎంత విలవిలలాడి పోయేదో. సూర్యారావు నిస్సహాయుడు. అతనికేం చేతకాదు. హౌస్ కీపింగ్ దగ్గర్నుంచీ మనీ మానేజ్‌మెంట్ దాకా ఆమే- షేర్లు కొనడం, అమ్మడం, బంగారం తాకట్టుపెట్టి అప్పు తెచ్చి బంగారం కొనడం, ఒకటేమిటి- ఇవ్వాళ సూర్యారావు సంసారం ఇంత పైకి రావడానికి కారణం ఆవిడే కదా?

''ఐయామ్ సో సారీ పాపా,'' అంటూ కూతురు వచ్చేసింది.

కూతురుకి అమెరికా సంబంధం చెయ్యడానికి అనూరాధ ఎంత కష్టపడిందో సూర్యారావుకి తెలుసు. అల్లుడి తల్లి కోరిన సవాలక్ష కోర్కెలు తీర్చడానికి ఎంత అవస్థపడిందో తెలుసు. ఆ కూతురు కడుపుతో వుంటే తాను పురుడు పొయ్యడానికి అమెరికా వెళ్లాలని ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకుంటోంది. టికెట్ ఎలాగూ కూతురు కొనిస్తుంది కానీ తనకీ కొన్ని డాలర్లు కావాలి కదా, అందుకోసం ఈమధ్య మరీ పిసినారిలా డబ్బు దాస్తోంది.

కూతురికి పిల్లల్ని కనడానికింకా టైం వుంది. ఆమె, ఆమె భర్తా వాడుకునే కార్లకి చేసిన అప్పులు, కొన్ని ఇంటికి కట్టాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్స్ వగైరాలన్నీ ఒక దారికి వస్తేగానీ పిల్లల్ని కనడానికి కుదరదు. పూర్ మామా, అప్పుడే పిల్లల్ని కనమంటుంది అని నవ్వు కునేది. పూర్ మామా వెళ్లిపోయింది. స్టేట్స్‌లో కూతురు వైభవం చూడకుండానే. షి కుడ్‌న్ట్ మేకిట్. కానీ ఈ జబ్బే మిటో క్వయిట్ ఎమేజింగ్. ''అల్లుడు రాలేదేవమ్మా,'' అన్నాడు సూర్యారావు.

''రవికి సెలవు దొరకలేదు పాపా- హి వజ్ సో సారీ- హి కుడ్‌న్ట్ మేకిట్,'' అంది ఆ అమ్మాయి. పేరు రజని. 'పోయింది మీ అమ్మ కదా- నువ్వు వస్తూ మీ పాపాని తీసుకురా ఇక్కడికి,' అన్నాడతను.

''శవానికి స్నానం కానివ్వండి,'' అన్నారు బంధువులు.

''స్నానం చేయిస్తే టాబ్లెట్లన్నీ కరిగిపోతాయి. తగ లెయ్యడానికేం వుండదు. పసుపు నీళ్లు చల్లి పవిత్రం చెయ్యండి,'' అన్నాడొకాయన.

''శవానికి స్నానం చేయించకపోతే పుణ్యలోకాలకి పోదు,'' అన్నది ప్రక్కింటి మామ్మగారు. పవిత్ర స్నానమా, పసుపునీళ్లా అని తర్జనభర్జన జరిగింది కాసేపు. చివరికి పసుపునీళ్లకే ఓట్లు పడ్డాయి. ''ఇంతకీ శవం కళ్లు ముయ్యలేదు,'' అన్నారు ఎవరో.

''ఐ కాన్ట్ డు ఇట్,'' అంది రజని.

సూర్యారావు ప్రయత్నించాడు. అతనికి ఆశ్చర్యం వేసింది. ఆమె బ్రతికి వుండగా ఎన్నోసార్లు మూయ గలిగేడు.

సుభద్రకి నెలనెలా డబ్బు పంపీ, మణితో కోవలం బీచికి వెళ్లి.

ఇప్పుడా కళ్లు మూసుకోడం లేదు. ఎంచేత- శవం బయలుదేరుతుండగా రొప్పుతూ వచ్చాడు పేథాలజీ ప్రొఫెసర్ ప్రకాశరావు. అతను అనూరాధకి పెద్దమ్మ కొడుకు. ఏవో పరికరాలు వెంటబెట్టుకొచ్చాడు.

''నా భార్య శవం మీద నీ పరిశోధనలకి నేను చచ్చినా ఒప్పుకోను,'' అన్నాడు సూర్యారావు. అతనికి

ప్రకాశరావంటే చాలా కోపం- అనూరాధకి అతనంటే యిష్టం కనుక.

"నా భార్యని సకల లాంఛనాలతో స్వర్గానికి పంపాల్సిన బాధ్యత నాది. ఆమె శరీరానికి వచ్చిన ఈ కళంకానికే నేను గుండె పగిలి ఛస్తున్నాను. ఇంకా ఇదొకటా," అన్నాడు సూర్యారావు.

"అదికాదు సూర్యం, ఇది వైద్య ప్రపంచానికే ఒక వింత సవాలు. ఇదిలా ఎందుకు సంభవించిందో తెలుసుకోడం మన విధి. ఇది చాలా అవసరం మనకి," అని మొండికేశాడు ప్రకాశరావు. అనూరాధ శరీరం టాబ్లెట్లుగా మారిపోయి, ఆమె చనిపోయిన విషయం అన్ని పత్రికల స్ట్రింగర్లకి తెలిసిపోయింది. ఆ జిల్లాలో జరిగే వింతలు, విశేషాలు ముక్కలుగా వీడియో తీసి ఒక ఛానెల్‌కి అమ్మే వీడియోగ్రాఫర్‌కి కూడా తెలిసింది. వీళ్లంతా రాకముందే శవదహనం జరిగితే బావుండి పోయేదనుకున్నాడు సూర్యారావు.

"మామయ్యని చూడనియ్ పాపా," అంది రజని. ప్రకాశరావు ఒక అరగంటసేపు అనూరాధ శరీరాన్ని పరీక్ష చేసి నోట్స్ రాసుకున్నాడు. ఈలోగా కొంతమంది ఫోటోలు తీసుకున్నారు. 'ఇదంతా అమ్మ శవానికే కదా పాపా- ఆవిడ ఆత్మ ఎప్పుడో స్వర్గానికి వెళ్లిపోయింది," అని తండ్రిని సముదాయించింది రజని.

ఎట్టకేలకు అనూరాధ శవం కట్టెల మీదకి వెళ్లింది.

"ఆ- ఏం శరీరంలెద్దూ అందులో చాలా భాగాలు లేవు. నాలుగేళ్లనాడు గర్భసంచి తీసేశారు. దానితో పాటు ఓవరీస్ కూడా తీశారు. పనిలో పనిగా ఎపెండిక్స్ కూడా తీశారు. ఇహ మిగతా రక్తం- కండా అంతా మాత్రల కింద మారిపోయాయి. వుంటే మెదడూ, గుండె వుండి వుండాలి," అన్నాడు సూర్యారావు కళ్లు తుడుచుకుని. అనూరాధ శరీరం రంగురంగుల మంటలతో మండుతోంది. టాబ్లెట్స్‌లోని కెమికల్స్‌లో నుంచి వచ్చే రంగులు- వున్నట్టుండి ఏదో పగిలిన శబ్దం వచ్చింది. చితిలోంచి ఒక ఆకుపచ్చగా పాచిపట్టిన పదార్థం ఎగిరి వచ్చి సూర్యారావు పాదాల దగ్గర పడింది. 'ఇదేమిటి,' అని ఉలిక్కిపడ్డాడు తాను. ప్రకాశరావు దాన్ని చేతిలోకి తీసుకుని చాకుతో పాచినంతా శుభ్రంగా గీరాడు. అందులో తళతళలాడుతూ వుంది అనూరాధ మెదడు. దాన్ని గుర్తుపట్టాడు సూర్యారావు. పెళ్లయిన కొత్తలో తనతో ఛెస్ ఆడిన మెదడు. బ్యాంక్ టెస్ట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకున్న మెదడు. ఇదేమిటిలా పాచిపట్టి పోయింది.

ప్రకాశరావు నవ్వి, "మీ ఇంట్లో సింకులూ బాత్ రూంలు తళతళా మిలమిలా మెరిసేలా కడిగేది కదా! ఆ పాచంతా వాటిల్లోంచి ఈవిడ మెదడులోకి చేరిపోయింది," అన్నాడు.

అలా అనూరాధ శరీరం అగ్నికి అర్పించి స్నానాలు చేసి యింటికి వచ్చి ఆమె ఫోటోల్లో అనువైన దాన్ని వెతికి లామినేట్ చేయించే కార్యక్రమానికి ఉపక్రమించిన సూర్యారావుతో, "నే వెళ్లొస్తానోయ్," అన్నాడు ప్రకాశరావు.

"నేనూ నీతో వస్తానంకుల్," అంది సుబ్బారావు కూతురు సుశీల.

"నాతో ఏం పనమ్మా నీకు," అన్నాడు పేథాలజీ ప్రొఫెసర్ ప్రకాశరావు. అతను అనూరాధని స్వంత చెల్లిలా చూసుకునేవాడు. ఎన్నోసార్లు ఎన్నో అడగని సలహాలిచ్చి ఆమె చేత చివాట్లు తిన్నాడు.

"అనూరాధ ఆంటీకి వచ్చిన జబ్బేమిటో మీరు నాకు చెప్పాలి," అంది సుశీల.

"నాకూ చెప్పు అంకుల్, మా మామాకి వచ్చిన జబ్బు నాకు తెలియకపోతే ఎలా?" అంటూ వచ్చింది రజని.

ప్రకాశరావు నవ్వి, "దీన్ని సూపర్‌మామ్ సిండ్రోమ్ అంటారమ్మా," అన్నాడు.

"నిజంగా మా మామ్ సూపర్‌మామే అంకుల్," అంది కళ్లు తుడుచుకుంటూ రజని.

"అదేనమ్మా ఆవిడ జబ్బు," అన్నాడతను.

"అదేమిటో ఎలా వచ్చిందో చెప్పండి అంకుల్ చంపకుండా," అని విసుక్కుంది సుశీల.

"మా అనూరాధకి ఈ ప్రపంచంలో వున్న ఆడవాళ్లందరికన్నా తను చాలా తెలివిగలదాన్ననీ, సమర్థురాలననీ గట్టి నమ్మకం. ఆవిడ దృష్టిలో తెలివీ సమర్థతా అంటే మంచి ఇల్లు కట్టకోడం, దాన్ని తళతళలాడేలా వుంచుకోడం, తగినంత డబ్బు దాచుకోడం, కష్టపడి పని చెయ్యడం, పిల్లల్ని గొప్పవాళ్లని చెయ్యడం- గొప్పవాళ్లని చెయ్యడం అంటే డాక్టర్లనో, ఇంజనీర్లనో చేసి స్టేట్స్‌కి పంపడం- అదీ ఇదీ కుదరకపోతే నీలా అమెరికాలో వుండే అబ్బాయికిచ్చి పెళ్లి చేసి పంపడం- ఇదే ఆవిడ జీవితధ్యేయం. ఆ ధ్యేయసాధనకి ప్రతీక్షణం శ్రమించింది. ఆవిడ యాంబిషన్ సిద్ధించింది," అని ఆగాడు ప్రకాశరావు.

"దానికీ ఈ జబ్బుకీ లంకేమిటీ?" అంది రజని విసుగ్గా.

"వుంది నాన్నా- ఈ ధ్యేయసాధనలో మీ అమ్మ తన మనసుకేం కావాలో, తన శరీరానికేం కావాలో చూసుకోలేదు. రకరకాల వంటలు చేసుకు తినడం, మంచి చీరెలు గంజి పెట్టి కట్టుకోడం, స్నేహితులలో, బంధువులలో ప్రత్యేకంగా కనపడడం, ఇదే తనకి కావాలనుకున్నది గానీ- డబ్బు ఆదా చేయడం కోసం మీ అమ్మ యంత్రంలా పనిచేసేది. శుభ్రం కోసం ఎవర్నీ చెయ్యనిచ్చేది కాదు. మీ నాన్నని సోమరిపోతులా కూర్చోబెట్టి కాఫీ చేతికిచ్చేది. ఎక్కువ డబ్బు పెట్టి పనివాళ్లని పెట్టుకుంటే ఎలాగని పన్లన్నీ తనే చేస్తూ, తాను చేసుకుంటేనే తనకి బాగుంటుందని నచ్చజెప్పుకునేది. సాయంత్రానికి విపరీతమైన అలసట. బ్యాంకులో క్యాష్ మార్చుతున్నప్పుడు ఎంత జాగ్రత్తగా పనిచెయ్యాలో నీకు తెలుసు గదా. అక్కడలా పనిచేసి వస్తూ దారిలో కూరలూ సరుకులూ మోసుకొచ్చేది. ఇంటికి రాగానే ఇల్లు శుభ్రం, వంట. ఈ అలసటకి తట్టుకోలేక రోజూ సాయంత్రం తలనొప్పి మాత్ర వేసుకునేది. ఇలా పదిహేనేళ్లుగా ఎన్ని తలనొప్పి మాత్రలు వేసుకుందో చూడు. అదలా వుండగా ఈవిడకి తాను వేసుకున్న ప్లాను ప్రకారం పనులు జరిగిపోవాలి. అలా జరగాలంటే శరీరంలో ఎలాంటి చికాకులూ వుండకూడదు. జ్వరం వస్తే ఓ క్రోసిన్ టాబ్లెట్ మింగడం- నడుము నెప్పికి ఇంకేదో మింగడం, అలా తన స్వంత వైద్యం చాలా వుండేది. ఇదికాక పండగలకి, పబ్బాలకి, పెళ్లిళ్లకి, వ్రతాలకి హాజరు కావాలంటే ఆ సమయంలో బహిష్టు కాకూడదు. దాన్ని రెండు మూడు రోజులు ఆపడానికి మాత్రలు వాడేది. అలా ఎన్ని వాడిందో లెక్కలేదు. మీ చదువులప్పుడు, మీ పరీక్షల్లో మీకు కాపలా కూర్చునేది. నిద్ర రాకుండా మాత్రలు వాడేది. ఒక్కోసారి ఎంత రాత్రయినా నిద్రరాక మాత్ర వాడేది. ఇలాంటి అవకతవక వైద్యాలతో మితిమీరిన పనిలో ఆవిడ షేర్లు కొనడం, అమ్మడం, స్థలాలు కొనడాలు, అమ్మడాలు, బంగారం తాకట్టు పెట్టి అప్పు తెచ్చి బంగారం కొని ఆ వాయిదాలు కట్టడం, జీతంలో నుంచి వీలైనంత డబ్బు మిగల్చడానికి మిగిలిన అన్నాలతో పులిహోరలు చేసుకు తినడాలు- ఒకటేమిటి- ఇదిగో ఇవ్వాళ మీరంతా ఇలా ఉండడానికి ఆవిడ చాలాచాలా మాత్రలు మింగింది. సరేనా, ఆ పరిస్థితుల్లో ఎనిమిదేళ్లనాడు ఓవర్ బ్లీడింగ్ అవడం మొదలైంది. అది చిరాకు కదా. ఓ డాక్టరు 'సంచీ కోసి పారేయించు హాయిగా వుంటావు,' అని సలహా యిచ్చాడు. గర్భసంచీ తీసేయించింది. ఓవరీస్‌లో ఏదో వుందని అదీ తీసేశారు.

"అమ్మయ్య ఇక నేను మీ మగవాళ్లల్లా నెలకి ముప్ఫైరోజులూ పనిచేస్తాను, అని విర్రవీగింది. నాలుగేళ్లు బాగానే గడిచాయి. ఇంతలో ఏవో కాంప్లికేషన్లొచ్చాయి. హార్మోన్ సప్లిమెంట్సివ్వాలన్నారు. అవీ మాత్రలే. మరి నీరసానికి ఈవిడంతట ఈవిడే ప్రతిరోజూ బీ కాంప్లెక్స్ మాత్ర వేసుకునేది. నలభై అయిదు దాటగానే చత్వారంతో పాటు బ్లడ్‌ప్రెషర్ కూడా వచ్చింది. దానికి రోజూ రెండు మాత్రలు- పిల్లలు కడతేరారు. కొడుకుని ఇంజనీర్ని చేసి స్టేట్స్‌లో వేసింది. నీకు అమెరికా పెళ్లికొడుకుని తెచ్చి ఈ అప్పులన్నీ తీర్చింది. ఇప్పుడేమిటంటే ఏడాది నుంచి ఓ ఛానెల్‌లో హిందీ సీరియల్ ఒకటి ప్రతీరోజూ రాత్రి పదకొండున్నరకి వస్తుంది. అది అమిత ఉత్కంఠభరితమైన సీరియల్. అది చూసేదాకా ఈవిడ నిద్రపోదు. ఆ సీరియల్ పన్నెండుదాకా నడుస్తుంది. పన్నెండు దాటిన తరువాత అంత సస్పెన్స్‌తో ఆ సీరియల్ ఆగిపోయాక ఈవిడకిక నిద్రరాదు. తప్పనిసరిగా మాత్ర వేసుకోవాలి. మళ్లా అయిదింటికి లేవాలి. ఇదమ్మా ఆ జబ్బు లక్షణం," ప్రకాశరావు తాను రాసుకున్న నోట్సు సంచీలో పెట్టేసుకుని కళ్లజోడు తీసి తుడిచి మళ్లీ కళ్లకి పెట్టుకున్నాడు.

"ఇదంతా నాకసలు తెలీదు. ఇటీజ్ క్వయిట్ ఎమేజింగ్ అంకుల్. ఐ డిడిన్ట్ నో. హౌ శాడ్," అంది రజని.

"అవునమ్మా, యు డిడిన్ట్ నో. ఎందుకంటే నువ్వు ఎప్పుడెప్పుడు అమెరికా మొగుణ్ణి కట్టుకుని డాలర్లు రుచి చూద్దామా అనే ఆతృతతో వున్నావు. అమ్మని పట్టించుకునే టైం నీకెక్కడిది. పైగా మీ అమ్మకి భిన్నమైన ఆలోచన మాత్రం నీకెక్కడిదీ!" అన్నాడు ప్రకాశరావు గేటు దాటుతూ.

సుశీల కళ్లు పెద్దవి చేసుకుని చూస్తూ నిలబడినదల్లా గబగబ ఇంటికేసి పరిగెత్తింది. ఆ పిల్లకి వాళ్లమ్మని కౌగలించుకుని భోరుమని ఏడవాలనిపించింది. ఆవిణ్ణి రక్షించుకోవాలనిపించింది.

*సుప్రభాతం, 20 జూన్ 1996*